క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో లక్ష తులసీ అర్చన



లక్ష తులసీ అర్చన నిర్వహించి కుడారై నైవేద్యం సమర్పించిన దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): సంజీవనగర్ రామాలయంలో గురువారం ధనుర్మాసాన్ని పురస్కరించుకొని శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామికి లక్ష తులసీ అర్చన అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం గోదాదేవి అమ్మవారికి అత్యంత ప్రీతికరమైన బెల్లం పాయసం నివేదన (కుడారై) నైవేద్యాన్ని సమర్పించారు.

రేపటి నుంచి ఇంటర్ డిస్ట్రిక్ట్ క్యాడెట్ ఫెన్సింగ్ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 28, 29 తేదీల్లో కాకినాడలోని లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్‌లోని క్రీడా మైదానంలో జరిగే పదవ ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ క్యాడెట్ యూ అండర్-17 బాలుర, బాలికల ఉమ్మడి కర్నూలు జిల్లా జట్ల ఎంపిక పోటీలు 2024-27 ఏడాదికి నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి కృష్ణమోహన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 01-01-2008 నుంచి 21-12-2011 మధ్యలో పుట్టిన వారు మాత్రమే అర్హులన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సిబ్బందికి ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం అందజేయాలని పేర్కొన్నారు.

నేడు రెవెన్యూ గ్రామసభ

ఉయ్యాలవాడ: మండలంలోని పడిగెపాడు గ్రామంలో శుక్రవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

31న ఎన్టీఆర్ భరోసా పింఛన్లు

ఉయ్యాలవాడ: ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఈ నెల 31వ తేదీనే లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. మండలంలోని 11 గ్రామ సచివాలయాల పరిధిలో 3,824 మంది లబ్ధిదారులకు వివిధ రకాల పింఛన్లకు సంబంధించి రూ.1,59,83,500 ప్రభుత్వం మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.

సచివాలయ ఉద్యోగిపై దాడికి యత్నం

ఆళ్లగడ్డ: సచివాలయ ఉద్యోగిపై దాడి చేసేందుకు యత్నించిన సంఘటన గురువారం కోటకందుకూరు గ్రామంలో చోటు చేసుకుంది. తహసీల్దార్ రత్నకుమారి తెలిపిన వివరాల మేరకు.. సచివాలయంలో విలేజ్ సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న ఇలియాస్ పొలం కొలతల విషయపై వెంకటక్రిష్ణారెడ్డి అనే వ్యక్తికి నోటీసులు జారీ చేశారు. దీనిపై ఆగ్రహించిన వెంకటక్రిష్ణారెడ్డి సర్వేయర్‌పై దాడి చేసేందుకు యత్నించగా గ్రామస్తులు అడ్డుకున్నారని.. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని తహసీల్దార్ తెలిపారు.

ప్రజావ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలు



పోస్టర్ విడుదల చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా,కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలకు సమాయత్తం కావాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యదర్శి ఎం.శంకర్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కార్యాలయంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభను జయప్రదం చేయాలని కోరుతూ గోడపత్రికలను విడుదల చేశారు. శంకర్ మాట్లాడుతూ ఈనెల 28వ తేదీన హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రెండు పార్టీల విలీన సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రకృతి వనరులను, ప్రభుత్వ సంపదను కారుచవకగా కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ, వినాశకర విధానాలపై చర్చిస్తామని చెప్పారు.

అలరించిన భక్తి సంగీత కార్యక్రమం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన జి.మంజుల వారిచే నిర్వహించిన భక్తి సంగీత కార్యక్రమం పలువురు భక్తులను అలరించింది. కార్యక్రమంలో గణపతి నమోనమః, పన్నగభూషణ, శివ శివ, బ్రహ్మమురారి సురార్చితలింగం, కాశీవిశ్వనాథాష్టకం, శివాష్టకం, శివస్తోత్రం పలు గీతాలు, అష్టకాలను మంజుల, సంగీతలక్ష్మీ తదితరులు ఆలపించారు. కీబోర్డు పి.శ్రీనివాసరావు, తబలా సహకారాన్ని టి.గురురాజ అందించారు.

కోత.. తప్పని మోత

- అన్నదాతకు భారమవుతున్న కోతమిషన్ చార్జీలు
- వెంటాడుతున్న వర్షాలు.. మధ్యదళారులదే పెత్తనం



దొర్నిపాడు పరిసరాల్లో మిషన్లతో వరికోతలు



కోతకు అనుకూలంగా నేలవాలిన వరికర్రలను కట్టలు కట్టుకున్న రైతులు

దొర్నిపాడు: వరి రైతులను కష్టాలు వెంటాడుతున్నాయి. ఇన్నాళ్లు వరుసపెట్టి వర్షాలు నష్టాల ఊబిలో నెట్టగా ప్రస్తుతం వరికోతలు రైతులను మోత మోగిస్తున్నాయి. యంత్రాల చార్జీలు మోయలేని భారంగా మారుతున్నాయి. నేలవాలిన పంటను కోస్తే ఒక రేటు.. తేమశాతం అధికంగా ఉంటే మరో రేటు నిర్ణయించి రైతన్న కష్టాన్ని దళారులు దోచుకుంటున్నారు. పోనిలే కోత జరిగింది ధాన్యం ఇంటికి వచ్చిందనుకుంటే వర్షాలు పంటను ఆరనివ్వకుండా అడ్డగించుకుంటుంది.

రంగంలోకి దళారీలు

రోజుకో తుపాన్ రైతులను కలవరపెడుతోంది. ప్రస్తుతం మిషన్ల సాయంతో వరికోతలను చకాచకా ముగిస్తున్నారు. గతంలో చాలా ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు ఎకరా వరిపంట చేతికి రావడానికి కేవలం గంటన్నర సమయమే పడుతుంది. ఇతర రాష్ట్రాల నుంచి యంత్రాలు అధిక సంఖ్యంలో మండలానికి వచ్చాయి. దీంతో యంత్రం నిర్వాహకులు గ్రామాల్లో కొంత మందిని దళారులుగా ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో వారికి గంటకు ఇంత కమిషన్ తీసుకుని పంటను చూపిస్తుంటారు. ఇదే అదునుగా తీసుకున్న దళారులు ఒట్టి పొలం అయితే రూ.2,400, నేల వాలిన పంట అయితే రూ.2,800, చేలో బురద ఉంటే రూ.3,200 ఇలా గంటకు రైతుల నుంచి చార్జీలను వసూలు చేస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే ఇంతేనని వాదిస్తున్నారు.

కోతమిషన్లకు భలే గిరాకీ

వర్షాల కారణంగా చేలల్లో వర్షంనీరు నిలిచి బురదగా మారి టయర్ల కోత మిషన్లు పొలాల్లో దిగబడిపోతున్నాయి. దీంతో తేలికపాటి చైన్‌మిషన్ల కోసం రైతులు ఎదురు చూడడంతో వాటికి మరింత గిరాకీ పెరిగింది. ప్రస్తుతం వాతావరణంలో మార్పుల కారణంగా పంటను వీలైనంత త్వరగా గట్టుకు చేర్చుకోవాలని చూస్తున్నారు. కొంత మంది దళారులు యంత్రాలను వారి ఆధీనంలో పెట్టుకుని అధిక చార్జీలను దండుకుంటున్నట్లు రైతులు వాపోతున్నారు.

మిషన్లు దొరక్క ఇబ్బందులు పడ్డాం



ఒకవైపు మిషన్ల కొరత మరో వైపు వర్షాలు చాలా ఇబ్బందులు పెట్టాయి. ఇప్పటికే చాలా వరకు పంట గాలివానలకు లేలవాలింది. గింజలన్నీ నేలరాలడంతో అధిక డబ్బు చెల్లించి పంటకోతను చేసుకున్నాం. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని అధిక నగదు వసూలు చేయడం దారుణం.

–ధనలక్ష్మి, వెంకటేశ్వరనగరం

ఇంటికి తెచ్చుకోవడానికి ఇబ్బందులే



కోత అనంతరం ధాన్యాన్ని ఇంటికి తెచ్చుకోవడానికి చాలా ఇబ్బందులు పడ్డాం. బురద కారణంగా బస్తాలకు నింపుకుని గట్టుకు మోయాల్సి వచ్చింది. దీంతో మాకు ఈ సారి కోత, మోత రెండు భారంగా మారాయి. అవసరం కాబట్టి వారు చెప్పినంత డబ్బులు చెల్లించి కోతలు కోయించుకుంటున్నాం.

–పుల్లయ్య, క్రిష్టిపాడు

సదాలక్ష్మమ్మ 97వ జయంతి



దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని మహికిశోర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి, మాజీ స్పీకర్ టీఎన్ సదాలక్ష్మమ్మ 97వ జయంతిని గురువారం నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఫౌండేషన్ చైర్మన్ సోమవారపు మహేశ్వరమ్మ మాట్లాడుతూ నీలం సంజీవరెడ్డి మంత్రివర్గంలో దేవదాయ శాఖ మంత్రిగా పనిచేశారని గుర్తు చేశారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ, క్రీడల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. శ్రీ జాంభవ పంచముఖ హనుమాన్ దేవస్థానం అధ్యక్షుడు బాయికాటి ప్రహ్లాద్, ట్రస్ట్ వైష్ణవ కిశోర్, వైభవ్ కిశోర్, ఫుట్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర కోచ్ అఖిల్, కుమారి పాల్గొన్నారు.

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేషపూజలను దేవస్థానం అధికారులు, అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

వైభవంగా సుదర్శన హోమం



ప్రత్యేక అలంకరణలో మద్దిలేటిస్వామి, సుదర్శన హోమంలో పాల్గొన్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): లోక కల్యాణం కోసం తెలుగుపేటలో వెలసిన శ్రీమద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వాతి వేడుకలను పురస్కరించుకొని గురువారం స్వామికి ప్రత్యేక పూజలు, సుదర్శన హోమం నిర్వహించారు. తెల్లవారుజామునే స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు సుప్రభాతసేవ,పంచామృతాభిషేకాలు చేపట్టి పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం లోక కల్యాణం కోసం స్వామి వారి నక్షత్రాన్ని పురస్కరించుకొని వేదపండితులు అందలన్ నరసింహచార్యులు, సింహగిరి శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో సుదర్శన హోమం వేదయుక్తంగా జరిపించి పూర్ణాహుతి గావించి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం దేవాలయ ఆవరణలో పల్లకీసేవ చేపట్టారు. ఆలయ నిర్వాహకులు మధుసూదనరాయల్ పాల్గొన్నారు.

అన్నదాత..కలత



పూతతో ఉన్న శనగపంటపై కురుస్తున్న వర్షం



దొర్నిపాడు శివారులో వరిధాన్యంపై కప్పిన పట్టలు

దొర్నిపాడు: వర్షం రైతన్న పాలిట శాపంగా మారింది. వరుసపెట్టి కురుస్తున్న వర్షాలకు అన్నదాత కలత చెందుతున్నాడు. రెండు రోజులుగా చెదురుమదురుగా కురుస్తున్న వర్షాలకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా శనగ పంట ప్రస్తుతం పూతదశలో ఉంది. వర్షం కారణంగా పూత వాడిపోతుండడంతో ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వరికోత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. దీంతో ధాన్యాన్ని రైతులు రోడ్లపై వేసుకున్నారు. ఫలితంగా వర్షం తాకిడికి పట్టలు కప్పి అలానే ఉంచేశారు. ఇలానే ఉంటే వడ్ల నాణ్యత తగ్గుందని ఆవేదన చెందుతున్నారు.

నేటి నుంచి తత్కాల్ కింద పది పరీక్ష ఫీజు చెల్లింపు

నంద్యాల(న్యూటౌన్): 2025 మార్చిలో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే రెగ్యులర్ విద్యార్థులు, ఒకసారి ఫెయిల్ అయిన విద్యార్థులు తత్కాల్ కింద రూ.1,000 అపరాధ రుసుంతో పరీక్ష ఫీజు చెల్లించే అవకాశం ఉందని డీఈఓ డీఈఓ జనార్దన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27 నుంచి జనవరి 10వ తేదీలోపు చెల్లించేందుకు అవకాశం ఉందన్నారు. ఇప్పటి వరకు పరీక్ష ఫీజు చెల్లించని పదో తరగతి విద్యార్థులను గుర్తించి ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు. తత్కాల్ పరీక్ష ఫీజు చెల్లింపు కోసం మరోసారి ఎట్టి పరిస్థితుల్లోనూ గడువు పెంపు ఉండదన్నారు.



చిన్నకంబలూరులో సీసీరోడ్డుపై పారుతున్న మురుగు, రుద్రవరం బలిజ కాలనీలో..

రోడ్లు మురుగుమయం



పెద్దకంబలూరులో ప్రభుత్వ పాఠశాల వద్ద నిల్వ ఉన్న మురుగునీరు

రుద్రవరం: మండల పరిధిలోని చిన్నకంబలూరు, పెద్దకంబలూరు, రుద్రవరం, శ్రీరంగాపురం, కొండమాయపల్లె తదితర గ్రామాల్లో మురుగు దరువు వేస్తోంది. ఆయా గ్రామాల్లో సీసీరోడ్లు ఉన్నప్పటికీ నీరు బయటకు పారే దారిలేక అక్కడే నిల్వ చేరుతోంది. చుట్టుపక్కల ఆవాసాలు ఉన్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా చిన్నకంబలూరు-అప్పనపల్లె దారిలోని సీసీరోడ్డుపై మురుగు పేరుకుపోయింది. ఇరువైపులా డ్రైనేజీ కాలువలు ఉన్నాయి. అయితే కాలువలు పూడిపోయాయి. నీరు వెళ్లేందుకు దారిలేక అలాగే సీసీరోడ్డుపై నిల్వ ఉంటోంది. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. దోమలు వృద్ధి చెందుతున్నాయి. దుర్గంధం వ్యాపిస్తుండడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. రుద్రవరం బలిజ కాలనీలో సీసీరోడ్డుపై నీరు నిరంతరం పారుతూనే ఉంది. అలాగే ఎద్దకంబలూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పక్కనే మురుగు కుంట ఏర్పడింది. కొండమాయపల్లె ఎస్సీ కాలనీలో సీసీరోడ్డుపై నీరు నిల్వ ఉండి మురుగుగా మారింది. ఇలాగే ఉంటే దోమ కాటుకు గురై రోగాల బారిన పడతామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మురుగు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సమస్యపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రమణ్యంను వివరణ కోరగా.. ఇదివరకే పలు పంచాయతీ కార్యదర్శులకు నోటీసులు ఇచ్చామని, మరోసారి వారితో మాట్లాడి మురుగు తొలగింపునకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రక్త నిల్వ కేంద్ర ఏర్పాటుకు స్థలాలను గుర్తించండి

- మొక్కలు అందజేసి నూతన సంవత్సర వేడుకలు జరుపుకోండి
- జిల్లా కలెక్టర్ రాజకుమారి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నంద్యాల: నూతన సంవత్సరంలో జిల్లాలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్త నిల్వ కేంద్ర ఏర్పాటుకు స్థలాలను అన్వేషించాలని జిల్లా కలెక్టర్, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్ రాజకుమారి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రెడ్‌క్రాస్ సొసైటీ ముద్రించిన గ్రీట్ విత్ గ్రీన్ పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో రక్త నిల్వ కేంద్ర ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. నూతన సంవత్సర వేడుకలను మొక్కల ద్వారా జరుపుకొని జిల్లాలో పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దామన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలకు ఉపయోగపడేలా నోట్ బుక్స్, జామెంట్రీ బాక్స్ తదితర విద్యా సామగ్రిని అందజేయాలన్నారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మొక్కల పంపిణీకి రెండు స్టాళ్లు ఏర్పాటు చేస్తారని, జనవరి వేడుకల రోజున మొక్కలను, విద్యాసామగ్రిని రెడ్‌క్రాస్ సొసైటీకి అందజేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటడంతో పాటు సంక్షేమ వసతి గృహాల్లో విద్యాసామగ్రిని విద్యార్థులకు పంచాలని చెప్పారు. రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ దస్తగిరి, ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, జిల్లా కోశాధికారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎప్పుడొస్తారో తెలీదు..!



చాగలమర్రిలో తెరుచుకోని వ్యవసాయ కార్యాలయం

చాగలమర్రి: మండల కేంద్రంలో ఉన్న రాఘవేంద్ర ఉన్నత పాఠశాల సమీపంలోని వ్యవసాయ కార్యాలయం, రైతు భరోసా కేంద్రం గురువారం ఉదయం 11.30 గంటలు దాటినా తెరుచుకోలేదు. రబీ సీజన్ కావడంతో పంటల బీమా ప్రీమియం చెల్లించడానికి వచ్చిన రైతులు కార్యాలయం మూసి ఉండడంతో వెనుదిగిరి వెళ్లారు. వివిధ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు సమయపాలన పటించడం లేదని.. ఎప్పుడు వస్తారో తెలియని పరిస్థితి నెలకొందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలి



పోలీసులకు సూచనలు ఇస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

మహానంది: శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు కృషి చేయాలని డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి సూచించారు. మహానంది పోలీస్ స్టేషన్‌లో గురువారం రికార్డుల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామ్మోహన్ రెడ్డి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. డీఎస్పీ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మహానంది క్షేత్రానికి నిత్యం వేలాది సంఖ్యలో భక్తులు వస్తుంటారని, ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఆలయ పరిధిలో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే అదుపులోకి తీసుకొని విచారణ చేయాలన్నారు. భక్తుల పట్ల ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీపీఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని సాయిబాబానగర్‌లో ఉన్న సీపీఐ కార్యాలయ ఆవరణలో సీపీఐ వందవ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు ముఖ్యఅతిథులుగా పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, మాజీ ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి అధ్యక్షుడు మురళీధర్‌తో కలిసి మాట్లాడారు. మతోన్మాద బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్వహించాలన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేసేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. సీపీఐ కోసం నిరంతరం కృషి చేసిన సలాంఖాన్‌ను ఘనంగా సన్మానించారు. పార్టీ సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, బెనహర్, అంకన్న, రైతు సంఘం కార్యదర్శి సోమన్న, ప్రజానాట్యమండలి కార్యదర్శి శివయ్య, గోస్పాడు, మహానంది, బనగానపల్లె నాయకులు హరిబాబు, సుబ్బారెడ్డి, సంజీవ్‌లు నాగరాముడు, ధనుంజయుడు, మహిళా అధ్యక్షురాలు లక్ష్మీదేవి, ఎర్రిస్వామి, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రవి, విష్ణు, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

గోస్పాడు: సీపీఐ ఆవిర్భావోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఏపీ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మీదేవి, పార్టీ మండల కార్యదర్శి హరినాథ్, సహాయ కార్యదర్శి జిలానీ బాషా ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు.

నాణ్యతకు తిలోదకాలు



బీటలు వారిన పశువైద్యశాల భవనం



వైద్యశాల గదుల్లో దెబ్బతిన్న టైల్స్



శిథిలావస్థలో మరుగుదొడ్డి గది

గత తెలుగుదేశం ప్రభుత్వంలో నిర్మించిన ఉయ్యాలవాడ పశు వైద్యశాల భవనం పదేళ్లకే శిథిలావస్థకు చేరుకుంది. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం, కాంట్రాక్టర్, ఇంజినీరింగ్ అధికారులు మిలాఖత్ కావడం.. పనులపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అయిందని రైతులు ఆరోపిస్తున్నారు. భవనం గోడలు బీటలు వారాయి. అత్యవసరాల నిమిత్తం ఏర్పాటు చేసిన మరుగుదొడ్డి శిథిలావస్థకు చేరింది. గదుల్లో ఏర్పాటు చేసిన బండ పరుపు(టైల్స్) ముక్కలుగా పగిలిపోయి శిథిలాలుగా దర్శనమిస్తున్నాయి. వర్షాకాలం భవనంలో నిల్వ చేసిన మందులు తడిసిపోయే ప్రమాదం ఉందని, భవన దుస్థితిపై పశు వైద్యాధికారిణి నాగ శైలజ ఉన్నతాధికారులకు నివేదికలు పంపినా ఎలాంటి స్పందన లేదు.

–ఉయ్యాలవాడ

సస్యరక్షణతో మామిడిలో అధిక దిగుబడులు

నంద్యాల(అర్బన్): ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో మామిడి తోటలకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నంద్యాల జిల్లాలో మామిడి తోటలు సుమారు 15వేల ఎకరాల్లో సాగులో ఉన్నాయని, ప్రస్తుతం పూమొగ్గ, పచ్చిపూత దశ , పూత దశలో ఉన్నందున వాతావరణ పరిస్థితులకనుగుణంగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల వల్ల రసం పీల్చే పురుగులు, తెగుళ్ల ఉధృతి అధికమయ్యే అవకాశం ఉందన్నారు. పూమొగ్గ దశలో ఉన్నప్పుడు తేనె మంచు పురుగులు ఆశిస్తాయని, పక్షి కన్ను తెగులు, బూడిద తెగులు నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ, క్లోరోథలోనిల్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. మామిడి తోట పచ్చిపూత దశలో ఉంటే తేనె మంచు పురుగు, పక్షికన్ను తెగులు, బూడిద తెగులు నివారణకు థయామిథాక్సమ్ 0.3 గ్రా. లేదా బుప్రోఫెజిన్ 1.5 మి.లీ మరియు హెక్సాకోనజూల్ 2 మి.లీ లేదా కార్బండజిమ్స్, మాంకోజెబ్ కలిపి 2 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ప్రస్తుతం మామిడి తోటలకు నీరు అందించడం నిలిపి వేయాలని, తోటలను కలుపు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు.